క్లుప్తంగా

ఆర్థిక సాయం

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సునార్కాని ఆనందరావు జ్వరంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ముప్పనపల్లి సహాయనిధి సభ్యులు అండగా నిలిచారు. ఈ మేరకు ఆదివారం రూ. 50 వేలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయి నిస్సాహయ స్థితిలో ఉన్న కుటుంబానికి చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని అన్నారు. కన్నాయిగూడెం సర్పంచ్ అల్లెం ప్రభాకర్, కమిటీ సభ్యుడు సతీష్, సత్యనారాయణ, రమేష్, సంజీవ, అంజయ్య, విజయ్, మధు, రాజేష్, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాకు తరలిరావాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒకరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో (నేడు) సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్‌ముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సన్మానం



మల్హర్: ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా వైస్ ఎంపీపీ బడితెల సరూప రాజయ్య, మంథని సోషల్ మీడియా కోఆర్డినేటర్ నస్పూరి నాగరాజులు ఆదివారం సన్మానించారు. భూపాలపల్లి జిల్లా జరిగిన ఓ వివాహానికి హాజరైన శ్రీధర్‌బాబును వారు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు.

బీఆర్ఎస్ అధికార ప్రతినిధిగా బాలాజీ



మహాముత్తారం: బీఆర్ఎస్ పార్టీ మండల అధికారి ప్రతినిధిగా మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన బోడ బాలాజీని నియమించారు. ఈ మేరకు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆదివారం బాలజీ నాయక్‌కు నియామక ప్రతాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేష్, మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు, కాటారం సబ్ డివిజన్ అధికార ప్రతినిధి బానోతు జహన్ నాయక్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దూలం మల్లయ్య, ఎంపీటీసీ శ్రీపతి సురేష్, కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ మండ వెంకటస్వామి, జగపతినాయక్, బాపు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహాముత్తారం: మండల పరిధిలోని దొబ్బలపాడు ప్రభుత్వ తెలంగాణ స్టేట్ మోడల్ జూనియర్ కాలేజీలో ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌ల్లో సీట్ల భర్తీ కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా ఆరోగ్య పథకంలో భాగంగా నేడు(సోమవారం) మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే 8 రకాల వైద్య పరీక్షలను మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ పొరండ్ల నాగరాణి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మహిళా ఆరోగ్య పథకంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మల్హర్: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. కొయ్యూరు ఏఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దతూండ్ల గ్రామానికి చెందిన రాంప్రసాద్(24) ఆగస్టు 21న గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు భూపాలపల్లి ప్రధాన ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహ మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఈనెల 2న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తిరిగి అతడిని ఈనెల 4న భూపాలపల్లి ప్రధాన ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడి బావ రాధకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వైభవంగా సామకొత్తల పండుగ



పూజలు నిర్వహిస్తున్న నాగులమ్మ ఉపాసకుడు రామకృష్ణస్వామి



ధర్మపీఠం వద్ద యెన్ను కడుతూ..



పూజలు చేస్తున్న వడ్డెలు

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మినర్సాపురంలోని శ్రీ నాగులమ్మ ఆలయంలోఆలయ ట్రస్టి, శ్రీ నాగులమ్మ ఉపాసకుడు బాడిష రామకృష్ణ ఆధ్వర్యంతో సామకొత్తల పండుగ(పొట్ట పండుగను ఆదివాసీ గిరిజన సాస్కృతి సంప్రదాయబద్ధంగా డోలి వాయిద్యాల నడుమ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గిరిజన సంప్రదాయ పద్ధతిలో గిరిజన పూజారులు, వడ్డెలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీనాగులమ్మ ఆలయ ప్రాంగణంలో గల ఎర్రమ్మ, సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, ఘడికామ రాజు, శ్రీ నాగులమ్మ గద్దెలను పూజారులు, వడ్డెలు శుభ్రపరిచారు. అమ్మవారికి సంబంధించిన కుండలు, ఆభరణాలను పసుపు కుంకుమలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి కొత్తపంట కొర్రలు, సామలు, మొక్కజొన్నలతో, పొట్ట దశలో ఉన్న చిరుధాన్యాలతో తయారు చేసిన పాయసాని ఆలయ పూజారి రామకృష్ణస్వామి ఇంటి నుంచి డోలివాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కొత్తగా పండిన కూరగాయలు, ఆకుకూరలు, గ్రామస్తులు, భక్తులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పొట్ట పండుగలో భాగంగా పొట్టదశలో ఉన్న పంటలను శ్రీ నాగులమ్మ అమ్మవారికి గిరిజన సాంప్రదాయ బద్ధంగా ఆదివాసీలు పూజలు నిర్వహించి సమర్పించారు. సామకొత్తల పండుగ ముఖ్య ఘట్టమైన యెన్ను కట్టడం కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని అమ్మవార్ల స్తంభాలకు పూజారులు గిరిజన సాంస్కృతిక సాంప్రదాయబద్ధంగా యెన్నుగట్టి రహస్య పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలోని కన్నాయిగూడెం, వాగొడ్డుగూడెం, లక్ష్మినర్సాపురం తదితర గ్రామాల నుంచి ఆదివాసీ గిరిజనులు, నాగులమ్మ అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి బాడిష నాగరమేష్, నవీన్, ఇర్ప నాగలక్ష్మి, రామకృష్ణ, కొమరం గాయత్రి, పాపారావు, బాడిష నవీన్, వడ్డెలు మడకం లక్ష్మయ్య, సోడి సత్యం, ఈసం సమ్మక్క, కట్టం సమ్మక్క, కుర్సం పుల్లయ్య, చౌళం భవాణి, హేమలత, సుప్రజ, గ్రామ పెద్దలు కుర్సం విష్ణు మూర్తి, కారం సాంబయ్య, బాడిష శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆలయంలో భక్తుల సందడి

పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ



ఏటూరునాగారం: చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: తెలంగాణ రాష్ట్రం కోసం సాయుధ పోరాటం చేసిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని రజక సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర లాలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి లాలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీరనారి చాకలి ఐలమ్మ సాయిధరైతాంగా పోరాటంలో వీరోచితమైన పోరాటం చేసి దేశముఖలను గడగడలాడించిందన్నారు. లాలయ్య, ఎల్లయ్య, ముక్కెర లాలయ్య, ముక్కెర భిక్షపతి, రవి, నరేష్ చారి, నరేష్, కోటి, మురళి, రఘుపతి, నగేష్, సందీప్, నాని, తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని మండలంలో రజక సంఘం నాయకులు నిర్వహించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు పైడాకుల సమ్మయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, సందీప్, అశోక్, నరేష్, రాంబాబు, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: మండల కేంద్రంలో ఆదివారం చాకలి ఐలమ్మ వర్ధంతిని మండల రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రసాద్, నాగేశ్వర్‌రావు, సాయి, వేణు, లక్ష్మయ్య, మల్లికార్జున్, సతీష్, సరబాబు, నర్సయ్య, సత్యం తదితరులు ఉన్నారు.



కన్నాయిగూడంలో..



వాజేడులో..

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సీతక్క



నివాళులర్పిస్తున్న సీతక్క

ములుగు రూరల్: కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఈ మేరకు ఆదివారం గోవిందరావుపేట మండలం పస్రాలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పులుగుజ్జు వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమయ్యారని అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంది చేతనైన సాయం అందిస్తూ అందుబాటులో ఉంటున్నానని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టేందుకు లేనిపోని మాటలు చేపుతున్న బీఆర్ఎస్ నాయకుల కుటీల ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అనంతరం సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని కార్యకర్తలు కష్టపడి పని చేయాలని అన్నారు. మండల అధ్యక్షుడు వెంకటకృష్ణ, శ్రీనివాస‌రెడ్డి, సీతారాంనాయక్, ఎల్లారెడ్డి, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

ఎస్ఎస్‌తాడ్వాయి: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలంలోని ఊరట్టం గ్రామంలో ఇటీవల మృతి చెందిన చర్పా సమ్మక్క దిశదిన కర్మకు ఆదివారం సీతక్క హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సీతక్క వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, మండల గౌరవ అధ్యక్షుడు అనంతరెడ్డి, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్, సీనియర్ నాయకులు కోటే నర్సయ్య, నేతాజీ పాల్గొన్నారు.

ములుగులో గులాబీ జెండా ఎగరాలి



ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న లక్ష్మణ్‌బాబు, నాగజ్యోతి

ములుగు రూరల్: ములుగు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్‌బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం గోవిందరావుపేట మండలంలో పార్టీ కార్యాలయాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడిగా బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు నేరుగా కలిసి గ్రామల పరిస్థితి, సమస్యలను తెలుపుకునేందుకు అందుబాటులో ఉంటానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో నాగజ్యోతి చెల్లెమ్మ గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి బాబ, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రావు, హనుమంతరావు, నర్సింహనాయక్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలకు ప్రత్యేక పూజలు

ఎస్ఎస్‌ద్వాయి: మేడారంలోని సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజులను జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు(లక్ష్మణ్‌బాబు) పార్టీ నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సీఎం కేసీఆర్, కేటీఆర్, మంత్రులు, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలను, నాయకులను, ప్రజాప్రతినిధులను కలుపుకుని ముందుకు వెళ్తానని తెలిపారు. మండల పరిధిలోని కాల్వపల్లికి చెందిన బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపుతామన్నారు. నాగజ్యోతి ఎమ్మెల్యే గెలుపునకు అమ్మవార్ల చల్లని దీవెనలు ఉంటాయని విజయం సాధించిన తర్వాత ఆమె ఎత్తు బంగారం మొక్కుగా చెల్లిసామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. లక్ష్మణ్‌బాబు, నాగజ్యోతి, ప్రజాప్రతినిధులను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు అరుణ్, కాక వెంకటేశ్వర్లు అమ్మవార్ల కండువాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై న అనంతరం తొలిసారిగా అమ్మవార్ల దర్శనానికి వచ్చిన లక్ష్మణ్‌బాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిబాబు, ఎంపీపీ గొంది వాణిశ్రీ, సర్పంచ్ చిడం బాబురావు, మండల అధ్యక్షుడు మల్లయ్య, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, ఏటూరునాగారం జీసీసీ డైరెక్టర్ పులుసం పురుషోత్తం, నాయకులు మోహన్ రావు, భద్రయ్య, సమ్మిరెడ్డి, బండారి చంద్రయ్య, పత్తి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



గోవిందరావుపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌బాబు

మంగపేటలో పారిశుద్ధ్య పనులు



గ్రామంలో ఫాగింగ్ చేస్తున్న జీపీ కార్మికుడు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

మంగపేట: మండల కేంద్రంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పొదుమూరు, సినిమాహాల్‌వీధి, గంపోనిగూడెం తదితర ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లపై పంచాయతీ కార్యదర్శి మాలోత్ హీరు పారిశుద్ధ్య కార్మికులతో ఆదివారం చెత్తా చెదారాన్ని తొలిగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించి క్లోరినేషన్ చేయించారు. ప్రధానంగా కొద్ది రోజులుగా వివిధ గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి జలుబు, దగ్గుతో పాటు దోమల తీవ్రత వలన జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో మండల కేంద్రంలోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పారిశుద్ధ్య పనులతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నారు.



నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న కార్మికురాలు

అపరిచితులు వస్తే సమాచారం ఇవ్వాలి

వాజేడు: గ్రామాల్లోకి అపరిచితులు వస్తే సమాచారం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ఇమాన్యూఎల్ అన్నారు. మండల పరిధిలోని కొప్పుసూరు గ్రామంలో ఆదివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కాటారం: మండల కేంద్రంతో పాటు చిద్నెపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం మంథనిలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండల కేంద్రానికి చెందిన అశోక్, అభినవేణ ఐలయ్య, చిద్నెపల్లికి చెందిన మహేశ్‌చారి, శ్రీకాంత్, చందు, రాజు, శేఖర్, రవి, మహేశ్‌లకు పుట్ట మధు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, జోడు శ్రీనివాస్, చెన్నూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

ఆలయాల అభివృద్ధికి కృషి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: ఆలయాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని జూకల్ గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయంలో పునరుద్ధరణ పనులను ప్రారంభించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కీ.శే.రావుల రాఘవరెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు రావుల వెంకట్‌రెడ్డి ఆలయ పునరుద్ధరణ పనుల కోసం రూ. 5 లక్షల నిధులతో పనులను చేయించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. అలాగే గతంలో గుడి నిర్మాణం కోసం వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు విరాళాలు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఉప సర్పంచ్ చాడ ఆనంద్‌రెడ్డి, ఎంపీటీసీ జంబుల తిరుపతి, మండల నాయకులు దావు వీరారెడ్డి, జంబుల చంద్రమౌళి, పిట్ట సురేష్, చిలుములు రమణాచారి, రవీందర్, రాజు, శ్రీమన్నారాయణ, కట్కూరి నరేందర్, ఎండి రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



తనిఖీలు చేస్తున్న వాజేడు పోలీసులు



తనిఖీలు చేస్తున్న పేరూరు పోలీసులు

వాజేడు: మండల పరిధిలో జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై ఇమాన్యూఎల్, చంద్రుపట్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వద్ద పేరూరు ఎస్సై రమేష్ ఆదివారం సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి అందులోని లగేజీని పరి శీలించారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డుపై దిగబడిన లారీలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాలెం గ్రామ సమీపంలోని కుక్కతోగు వాగు సమీపంలోని ములమలుపు వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా రెండు లారీలు బురదలో ఆదివారం దిగబడ్డాయి. దీంతో వెంకటాపురం మండల కేంద్రం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలాలకు వెళ్లే వాహనాలు చర్ల నుంచి వెంకటాపురం మండలాలకు వచ్చే వాహనాలు రోడ్డుపైనే సుమారు గంటకుపైగా నిలిచి పోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం ఎస్సై అశోక్ సంఘటన ప్రాంతానికి చేరుకొని జేసీబీ సాయం రోడ్డుపై దిగబడిన లారీలను తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అనంతరం ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డుపై ఉన్న బురదను తొలగించి మరమ్మతులను చేయించారు.



రోడ్డుపై దిగబడిన రెండు లారీలు

బియ్యం అందజేత

ములుగు రూరల్: మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామానికి చెందిన తిక్క బన్ని ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్ ఆదివారం పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు యువరాజు, ఎంపీటీసీ జన్నారపు శ్రీను, రవి, కార్తీక్, రమేష్, అశోక్, యుగేంధర్ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న నాయకులు